14082024-MAI-06_Layout 1 8/14/2024 1:55 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కాంగ్రెస్ దా'రుణం'

అప్పుచేసి పప్పు కూడు తినొద్దన్నారు పెద్దలు. కానీ, అప్పుచేసి ఆస్తులు పెంచుకుంటే తప్పు కాదనేది ప్రస్తుతం చెలామణిలో ఉన్న సూత్రం. డబ్బు ముందుగా అదా చేసి, తాపీగా లెక్క పెట్టుకొని, ఆపై ఖర్చుచేసే పరిస్థితి ఎక్కడా లేదిప్పుడు. ఈ రోజుల్లో ఇల్లు, కారు, చివరికి రోజువారీ సరుకులు కొనాలన్నా అప్పే మార్గం. క్లుప్తంగా చెప్పాలంటే ప్రస్తుతం నడుస్తున్నది 'రుణ ఆధారిత ధన వ్యవస్థ'. ఇక ప్రభుత్వాలైతే చెప్పేదేముంది? అప్పు లేకుండా అర గంట కూడా గడవదు. అమెరికాకూ జీడీపీ కంటే ఎక్కువ అప్పుంది. అమెరికా అప్పు రోజుకు వెయ్యి కోట్ల డాలర్ల చొప్పున పెరుగుతున్నదట. దేశాలు అప్పులు తీసుకోకపోతే ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వంటి సంస్థలు దివాలా తీస్తాయి! అప్పు తప్పు అనేసి తప్పుకోకుండా చేసిన అప్పు దేనికి ఖర్చు చేశారనేది చెప్పుకునే స్థితిలో ఉండటం ముఖ్యం.

అధికారంలోకి రావడానికి ముందు కాంగ్రెస్ తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని గగ్గోలు పెట్టింది. అందుకు నెపమంతా కేసీఆర్‌పైనే వేసింది. అప్పు తప్పన్నట్టుగా ఊదరగొట్టింది. కేసీఆర్ ప్రభుత్వం అప్పు చేసింది పరిమితికి లోబడే. పైగా ఆ డబ్బు ఏదో పప్పుబెల్లాలకు ఖర్చు చేయలేదు. తరతరాలకు పనికివచ్చే లక్షల కోట్ల ఆస్తులు తయారు చేసి ప్రజలకు భరోసా కల్పించింది. కాళేశ్వరం, పాలమూరు, మిషన్ భగీరథ వంటి ప్రజోపయోగ పథకాలు తీసుకువచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని వీరంగం వేసిన కాంగ్రెస్ పాలకులు సుద్దపూసల్లా ఉండిపోయారా? అంటే అదేమీ లేదు. గత 8 నెలల్లో రూ.50 వేల కోట్ల అప్పు చేశారు. 'కేసీఆర్ చేసిన అప్పు మేం కడుతున్నా'మని తెగ ఇదైపోతున్న కాంగ్రెస్ నేతలు తాము తెస్తున్న అప్పును ఎవరు తీరుస్తారో చెప్పగలరా? ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అప్పును కేసీఆర్ ప్రభుత్వం తీర్చిందన్న వాస్తవాన్ని కాదనగలరా? ఆ సంగతి అలా ఉంచితే ప్రస్తుత పాలకులు చేసిన అర లక్ష కోట్ల అప్పు దేనికోసమో చెప్పే నాథుడే కరువయ్యాడు. ప్రాజెక్టులు కట్టారా? ప్రజా సంక్షేమానికి ఖర్చుపెట్టారా? అంటే సమాధానం లేదు. రావాల్సిన రైతుబంధు రావడం లేదు. పింఛన్లు పడటం లేదు. మరి అంత సొమ్ము ఏమైనట్టు? 60 ఏండ్ల ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వాలు చేసిన అప్పు సుమారు 72 వేల కోట్లు. ఇటున్న ఇటుకను అటు పెట్టని కాంగ్రెస్ సర్కార్ ఏడాదిలోపే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులున్నాయనే నానుడిని నిజం చేసి చూపింది.

అప్పులతో రాష్ట్రం మరో శ్రీలంకలా మారుతుందని గాయి గాయి చేసిన సీఎం రేవంత్ తనదాకా వస్తేగానీ తత్వం బోధపడదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అప్పుల సంసారాన్ని ఒడ్డున పడేసేందుకు తంటాలు పడుతున్నానని ఆయన చెప్పినవన్నీ కల్లబొల్లి కబుర్లే! బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపద బాగా పెరిగిందనేది ఎవరూ కాదనలేని వాస్తవం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ.. ఇలా అన్నింటా తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. కానీ నడమంత్రపు పాలన వచ్చి అంతా తారుమారైంది. ఇదివరకటి ప్రభుత్వంపై అక్కసుతో ప్రాజెక్టులను పడావుపెట్టి వ్యవసాయాన్ని మూలకు నెట్టారు. సంపద పెంచడం, పంచడం అనే కేసీఆర్ పరిపాలనా సూత్రం పట్టు దొరకక కాంగ్రెస్ ప్రభుత్వం చతికిలపడుతున్నది. చేతకాని తనాన్ని ఆకతాయి మాటల కింద మరుగుపర్చాలని చూస్తే నిజానిజాలు ప్రజలకు తెలియకుండా ఉంటాయా? నక్కలు బొక్కలు వెతుకును అన్నట్టుగా గత ప్రభుత్వపు తప్పులెన్నుతూ కూర్చుంటే రాష్ట్రం ముందుకువెళ్లదు. అప్పులలో చేతివాటం చూపడం కన్నా అభివృద్ధిని పరుగులు పెట్టించే మార్గాల కోసం అన్వేషిస్తే ప్రభుత్వానికీ, ఏతావాతా ప్రజలకూ మంచిది!

కులనిర్మూలనలో లెఫ్ట్ వైఫల్యం

వందేండ్ల కమ్యూనిస్టు ఉద్యమం భారతదేశంలో అనేక ఆర్థిక, రాజకీయ పోరాటాలు చేసింది. ఎందరో నాయకులు తమ జీవితాలను త్యాగం చేశారు. అయితే భారతదేశంలో అస్పృశ్యత నివారణ, కుల నిర్మూలన విషయంలో వారు నిర్దిష్టమైన కార్యక్రమాలతో ముందుకు వెళ్లలేకపోయారు. కాబట్టి ఆ ఉద్యమం విఫలమైందని చెప్పక తప్పదు. దీనికి కారణం కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధానంగా అగ్రకుల, అగ్రవర్ణ ఆధిపత్యం కొనసాగుతూ రావడమే. ముఖ్యంగా కమ్యూనిస్టులు హిందూ మతోన్మాదాన్ని ఎదిరిస్తున్నారు. కానీ, హిందువులుగా జీవిస్తున్నారు. కులాన్ని నిర్మూలించకుండా వర్గ విప్లవం విజయవంతం కాదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాడే చెప్పారు.

డాక్టర్ కత్తి పద్మారావు
98497 41695

'ఈ రోజుల్లోనూ కులవ్యవస్థను సమర్థించేవాళ్లుండటం ఒక దురదృష్టం. కుల వ్యవస్థను సమర్థించడం ఎన్నో రకాలు. అందులో ఒకటి కుల వ్యవస్థను శ్రమ విభజన (పనిని పంచుకునే) పద్ధతితో పోల్చడం. కులవ్యవస్థ శ్రమ విభజనే కాదు, అది శ్రమికుల విభజన కూడా. నాగరిక సమాజానికి శ్రమ విభజన అవసరమే. అయితే, శ్రమ విభజనతో పాటు శ్రామికుల విభజన జరగడం, వారి నడుమ అసహజమైన, అలంఘ్యమైన అడ్డుగోడలు కట్టబడటం ఏ నాగరిక సమాజంలోనూ లేదు. అంతేకాదు, శ్రామికుల్లోని ఈ విభాగాలు ఒకదానిపై ఒకటి నిమ్నోన్నత కులాల వారీగా నిర్మించబడిన వారసత్వపు నిరంకుశత్వం ఇది. శ్రామికులలో శ్రామికులు హెచ్చుతగ్గ తారతమ్యాలతో తరగతులుగా విభజింపబడిన ఈ రకమైన పద్ధతి మరే దేశంలోనూ లేదు. కులవ్యవస్థలోని ఈ పద్ధతి వ్యక్తులు చేయవలసిన పనులను, అవలంబించవలసిన వృత్తులను, పుట్టుకను బట్టి ముందే నిర్ణయించడం అనే పద్ధతి. తాము ఏ పనికి తగుదురో, ఏ వృత్తికి సమర్థులో అట్టి పనులను, వృత్తులను చేబట్టే స్వేచ్ఛను హిందువులకు కులవ్యవస్థ అనుమతించడం లేదు' అని అంబేద్కర్ అన్నారు.

అంబేద్కర్ సామాజిక, ఆర్థిక శాస్త్రంలో అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం చేసిన మేధావి. ఆయన 'భారతదేశంలో కార్మికవర్గం, కర్షక వర్గం ఒక వర్గంగా రూపొందాలంటే వారిలోని కులభావం, హిందూమత భావాన్ని నిర్మూలించాలి. అంటే ఆర్థిక పోరాటానికి ప్రతి అడుగులో కులం, మతం, వర్ణం, ఆచారం, సంప్రదాయం, మూఢత్వం అడ్డువస్తా'యని చెప్పారు. 'మార్క్సిస్టులు సీపీఐ, సీపీఐఎంఎల్ పార్టీలలో ఉన్న నాయకవర్గం హిందూమత భావజాలంలో ఉన్నంతకాలం వారు భారత దేశంలో ఏ రకమైన పరిణామాన్ని తీసుకురాలేర'ని అంబేద్కర్ స్పష్టంగా చెప్పారు.

'నా ఉద్దేశాన్ని మీకు ఇంకా విపులంగా చెప్పాలంటే సోషలిజాన్ని సాధించడంలో సాధక బాధకాలు అన్నింటినీ పూర్తిగా వివరించవలసి ఉన్నది. సోషలిస్టులు ఉద్దేశించిన ఆర్థిక సంస్కరణలు ఎప్పుడు, ఎలా సాధ్యపడుతుంది? విప్లవం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకుంటే కానీ అది సాధ్యం కాదన్నది స్పష్టమే కదా. ఆ అధికారాన్ని చేజిక్కించుకునేవాళ్లు కార్మికవర్గం (ప్రొలిటేరియట్) ప్రజలై ఉండాలి. అయితే, ఇక్కడ నేను అడిగే మొదటి ప్రశ్న విప్లవం తేవడానికి ఇండియాలోని కార్మికవర్గ ప్రజలంతా ఏకమవుతారా? ఆ విప్లవానికి ప్రజలను ప్రేరేపించే శక్తి ఏది? నా దృష్టిలో ఆ శక్తి ఒక్కటే. అది ఏదంటే తనతో పాటు విప్లవంలో పాల్గొంటున్న మరొక వ్యక్తి పట్ల సంపూర్ణ విశ్వాసం. కార్మిక వర్గం అంతా కలిసి ఏకం కాకపోతే, ఏక ముఖంగా పోరాడటానికి ఉద్యమించకపోతే విప్లవం ఎలా రాగలదు? ఇంపైన సమాసాలను, భాషను వాడటంలోనే సోషలిస్టులు తృప్తి పడకుండా, సోషలిజం అనేదాన్ని నిర్దిష్టమైన వాస్తవ రూపంలో సాధించాలనే కోరిక తమకుంటే వారు సాంఘిక సంస్కరణ ప్రాధాన్యాన్ని గుర్తించక తప్పదు' అని అన్నారు అంబేద్కర్.

నిజానికి భారతదేశంలోని కమ్యూనిస్టులు కుల నిర్మూలన ప్రాధాన్యాన్ని, అస్పృశ్యత నిర్మూలన ప్రాధాన్యాన్ని తెలిపేవాటి పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని, దీనికి కారణం భారతదేశ వ్యాప్తంగా బ్రాహ్మణుల చేతిలో కమ్యూనిజం, తెలుగు రాష్ట్రాల్లో కమ్మ, రెడ్డి నాయకత్వంలో ఉండటం వల్ల వారు తెలిసే కుల నిర్మూలనా పట్ల, అస్పృశ్యత పట్ల ఉదాసీనంగా ఉన్నారని చెప్పక తప్పదు. ఈ విషయంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆయా రాష్ట్రాల్లో ఉండే కులాధిపత్యాలను అధ్యయనం చేశారు. ముఖ్యం గా తెలుగు రాష్ట్రాల రూపకల్పనలో కమ్మ, రెడ్డి ఆధిపత్యం ఏర్పడింది. కమ్యూనిస్టులు ఏపీలో అనేక సందర్భాల్లో కాంగ్రెస్‌తోనూ జతకట్టారు. తెలంగాణలో రెడ్లు, రెడ్లు ఏకమవుతారు. కాంగ్రెస్ రెడ్లు, కమ్యూనిస్టు రెడ్లు ఏకమవుతుంటారు. కోస్తాంధ్రాలో కూడా కమ్యూనిస్టులు రెడ్లు, కాంగ్రెస్ రెడ్లు ఏకమవుతారు. అందువల్ల అస్పృశ్యత నిర్మూలన, కుల నిర్మూలన, కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా వారు తీసుకోలేకపోయారు.

కారంచేడు ఉద్యమం తర్వాత కులాధిపత్యం మీద, కుల నిర్మూలన మీద పెద్ద ఎత్తున చర్చ జరిగింది. కులాన్ని, అస్పృశ్యతను కమ్యూనిస్టు ఉద్యమం విస్మరించిందని పీపుల్స్‌వార్ నుంచి బయటకు వచ్చిన కె.జి.సత్యమూర్తి, ఓపీడీఆర్ నాగిరెడ్డి గ్రూప్ నుంచి వచ్చిన కంచె ఐలయ్య, నక్సలైట్ మూమెంట్ నుంచి వచ్చిన బీఎస్ రాములు లాంటి చాలామంది నేతలు బాహాటంగా చర్చకు దిగారు. కమ్యూనిస్టు ఎంఎల్ పార్టీ ప్రతినిధులుగా ఉన్న బ్రాహ్మణవర్గం వారు కె.జి.సత్యమూర్తికి, బీఎస్ రాములుకు, కంచె ఐలయ్యకు సమాధానం చెప్పలేకపోయారు. భారత కమ్యూనిస్టు ఉద్యమం కులానికి భారత సమాజంలో ఉండే పట్టు విషయంలో సరైన అంచనాతో ఉద్యమాన్ని నడపలేదు. తెలంగాణ, శ్రీకాకుళం పోరాటాలు జరిగిన ప్రాంతాల్లో కులం వేళ్లు తెగలేదు. అస్పృశ్యతాభావం రూపుమాయలేదు. అనేక సందర్భాల్లో కమ్యూనిస్టు ఉద్యమకారుల రచనల్లో దళితుల పరిస్థితుల గురించి విశ్లేషించారు. తరిమెల నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం'లో, పుచ్చలపల్లి సుందరయ్య, దేవులపల్లి 'తెలంగాణ పోరాట చరిత్ర'ల్లోనూ దళితుల స్థితిగతులపై కొన్ని భాగాలు రాశారు.

అయితే, ఈ అస్పృశ్యత, కులం నిర్మూలనలను ఒక పాలసీగా తీసుకొని పనిచేయకపోవటం వల్ల సొంత కుటుంబాల్లో, సొంత కులాల్లోనే పెళ్లిళ్లు జరుగుతూ రావడంతో పార్టీలకు నాయకులు మిగిలిపోయారు. అందుకే, ఈనాడు కమ్యూనిస్టు ఉద్యమం పునశ్చరణ చేసుకున్నది. అస్పృశ్యత నిర్మూలనా, కుల నిర్మూలనా సిద్ధాంతాలను, కార్యక్రమాల ప్రధాన వైవిధ్యంగా స్వీకరించి అంబేద్కర్‌ను ఆధునిక సిద్ధాంత కర్తగా అన్వయించుకున్నది. పునర్నిర్వేచనతో ముందుకు నడిస్తే లక్షలాది మంది కార్యకర్తలున్న కమ్యూనిస్టు ఉద్యమం భారతదేశ సాంఘిక, సాంస్కృతిక విభాగాల్లో రాబోయే దశలలో పెను మార్పులు తీసుకురావడానికి చారిత్రక చోదకశక్తి అవుతుందని దళిత ఉద్యమం, అంబేద్కర్ ఉద్యమం బలంగా నమ్ముతున్నాయి.

తొందరపడ్డాం అనుభవిస్తున్నాం!

భోజన్నగారి అనసూయ

'వడ్డించేవాడు మనవాడైతే బంతి చివరన కూర్చున్నా మన వంతుకు వస్తుంది' అని మన దగ్గర ఒక సామెత. అయితే ఆ సామెత ఓటరు మహాశయులకు ఎందుకో అస్సలు నచ్చదు. వడ్డించేవాడు తనదాకా రాక ముందే మధ్యలోనే లేచిపోతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల విషయంలో అదే జరిగింది. కానీ, సినిమాల విషయానికి వస్తే ప్రజలు వేరేలా స్పందిస్తున్నారు.

తన అభిమాన సినీ హీరో సినిమా టికెట్ ధర ఎంతెక్కువున్నా ఆ సినిమా చూస్తారు. ఎన్నిసార్లయినా చూస్తారు. ఆ హీరోకు సంబంధించిన ఏదేని చిన్న ఈవెంట్ ఎక్కడ జరిగినా, దానికోసం కొట్లాడి మరీ తొక్కిసలాటలో టికెట్ కొనుక్కొని చూస్తారు. సినిమా విడుదల రోజు పూలదండలు, పాలాభిషేకాలు, రక్తదాన శిబిరాలు, హీరో పుట్టినరోజు అన్నదానాలు, హీరో పేరిట రకరకాల వస్తు పంపిణీలు.. అబ్బో చెప్తూ పోతే లిస్టు పెద్దగానే ఉంటది.

ఇక రాజకీయం విషయానికి వస్తే మన ఇంట్లో ఏ చిన్న సమస్య వచ్చినా 'విషయం' ఫలానా ఎమ్మెల్యేకు, కుదిరితే మంత్రికి, వీలైతే 'ముఖ్యమంత్రి'కే చెప్పాలని ప్రయత్నిస్తాం. పొరపాటున 'ముఖ్యమంత్రిని కలిసే అవకాశం ఇప్పుడు లేదు' అని పక్కవాళ్లు ఎవరైనా చెప్తే.. 'ఐపోయే' ఇగ అన్నట్టు బద్నాం చేసుడు షురూ జేస్తం. మనల్ని ఒక్కళ్లని కలువకుంటే, ముఖ్యమంత్రి అసలు ఎవ్వల్ని గూడ కలుస్త లేరని బద్నాం జేస్తం. 'ఒక్క కుటుంబమే అధికారం చెలాయిస్తున్నదని, డబ్బు మొత్తం దుర్వినియోగం చేస్తున్నద'ని అని అడిగినోళ్లకు, అడగనోళ్లకు అందరికీ ప్రచారం చేస్తం.

పచ్చ మీడియా ఒకటి ఉండనే ఉన్నది మన తెలంగాణ పాలిట. ముందు నుంచి అబద్ధాలు పండి వార్చనీకి, ఇట్లాంటి వాళ్లను గంటలు గంటలు స్టూడియోలో కూపోబెట్టి వాడుకునేందుకు. ఆ సమయంలో ఆ యాంకర్ దగ్గరుండి చూసినట్టే చెప్తుంటరు జనాలకు.

అభిమానం సహజంగానే గుర్తింపు కోరుకుంటుంది. మన గురించి ఎక్కువ ఆలోచించాలని, మనకే ఎక్కువ విలువ ఇయ్యాల్ననే ఈగో ప్రతి మనిషికి కొంత ఉంటుంది. కానీ, మనం దాన్ని అదుపులో ఉంచుకోగలగాలి. అభిమానం అదుపులో ఉంచుకొనుడు ప్రేమికులు, పేరెంట్స్, చుట్టాలు, ఇరుగుపొరుగు, స్నేహితులు, ప్రయాణాల్లో తోటి వారు ఇట్ల ప్రతి ఒక్కరి దగ్గరా పాటించాలి సుమా!

నిజానికి డబ్బుకు ఓటు ఎప్పుడో అమ్ముడుపోయింది. (డబ్బు, వస్తువు తీసుకొని ఓటేసిన వాళ్లను దృష్టిలో ఉంచుకొని మాత్రమే) డబ్బు తీసుకుంటే ఆ ఓటరుకు నైతిక హక్కు పోయినట్టే. నాయకులే అలవాటు చేశారని ఓటరు.. ఓటరు డబ్బు, వస్తువు ఇస్తేనే ఓటు వేస్తామన్నారనీ రాజకీయ నాయకులు.. ఇది ఇగ ఇప్పట్లో ఒడువని ముచ్చట. డబ్బు తీసుకొని ఓటేసి, ప్రతి సంక్షేమ ఫలం తనకు, తన అస్మదీయులకే రావాలనే కాంక్షతో కొంచెం కూడా ఓపిక లేక అర్థం పర్థం లేని అల్లుడు. ఆలోచన లేని తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం.

పదేండ్ల తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఊహించని మంచి పరిణామాలను మనం చూశాం. ఆ ఫలితాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుభవిస్తూనే ఉన్నాం. పాఠశాలల మూలంగా ఎంతోమందికి ఉచిత, నాణ్యమైన విద్య, జిల్లాకో మెడికల్ కాలేజీతో విరివిగా అందే వైద్యం, ముఖ్యంగా సాగు, తాగునీరు, 24 గంటల కరెంటు సౌకర్యాన్ని పొందుతున్నాం. దేశం మొత్తాన్ని మన తెలంగాణ వైపు చూసేటట్టు చేయగలిగిన 'బీఆర్ఎస్' పార్టీ తప్పకుండా ప్రతి ఒక్క లబ్ధిదారుడిని గుర్తిస్తుండేది, కొద్దిగా ఆలస్యమైనా. కానీ, ఇంతలోనే తొందరపడ్డాం. డెబ్భై ఏండ్ల నుంచి జరిగిన అన్యాయాలు కనుమరుగు కాకముందే తొందరపడ్డాం. ఈ పదేండ్ల అభివృద్ధి విలువ మనకు పూచిక పుల్ల కూడా కాదని 'మార్పు కావాలి' అని తొందరపడ్డాం. ఊదర పాటకు భ్రమసిపోయి ఇప్పుడు 'కాలుగాలిన పిల్లి'లెక్క తిరుగుతున్నాం. ఇటు కక్కలేక, అటు మింగలేక అవస్థలు పడుతున్నాం.

అన్యాయం ఏమంటే.. సినిమా హీరో దరిదాపులకు రానివ్వకున్నా ఆ హీరో మీద ఇంత కూడా కోపం పెట్టుకోని మనం... మంచిచేసిన రాజకీయ నాయకుని మీద కోపాన్ని పెంచుకున్నాం. ఇంట్లో వాళ్లకు తినడానికి కూడా ఉందో లేదో చూసుకోకుండా సినిమా హీరోలకు పూలు, పాలతో అభిషేకాలు చేసే మనం, దోస్తులను కూడా వెంటబెట్టుకొని అభిమాన హీరో సినిమాను ఎన్నిసార్లు చూస్తామో లేక్కేలేదు. కానీ, రాజకీయ హీరో మాత్రం మనం ఎప్పడంటే అప్పుడు మన ముందుకే రావాలి, సమాధానం చెప్పాలి, సహాయం చేయాలి.

బహుళ ప్రయోజన పనులు ఎప్పటికైనా ప్రభుత్వమే చేస్తుంది. ఎన్నో విషయాలు చక్కగా ప్లాన్ చేసుకునే ఓటర్లు ఎందుకో ప్రభుత్వాల విషయంలో తక్షణ ఫలితాలే కావాలని కోరుకోవడం విడ్డూరం. పదేండ్ల స్వరాష్ట్ర పాలనలో మనం సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా చూడగలిగాం, అనుభవించాం. అయినా సరే అర్థం లేనివిధంగా అలిగాం. మనకు మంచిగనిపించి కూడా తొందరపడ్డాం. అందుకే వండి వడ్డించేవారినే గుర్తిద్దాం. అవకాశమిద్దాం. ఫలితం అనుభవిద్దాం. తొందరపాటు వద్దు.

స్వాతంత్ర్య పోరులో ముస్లిం వీరులు

ముహమ్మద్ ముజాహిద్
96406 22076

సంకుచిత భావాలు గల కొందరు చరిత్రకారులు 1857, అంతకుముందు జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో అసువులుబాసిన యోధుల పేర్లను కనుమరుగు చేశారు. వారంతా ముస్లింలు కావడమే అందుకు కారణం. నాటి స్వాతంత్ర్య పోరాటంలో హిందువులతో పాటు ముస్లింలు జతకలిశారు. కానీ, ఏదో నామమాత్రంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి ఒకరిద్దరి పేర్లు తప్ప చెప్పుకోదగ్గ స్థాయిలో ఇతర వీరుల పేర్లు కానరావు. స్వతంత్ర పోరాటంలో నామమాత్రంగా కూడా పాల్గొనని కొన్ని సంస్థల ప్రతినిధులు దేశభక్తి, జాతీయవాదం గురించి మాట్లాడటం విడ్డూరం. ఈ గడ్డలో పుట్టి తమ మాతృభూమి బానిస సంకెళ్లను తెంచేందుకు ప్రాణ త్యాగాలు చేసిన అష్ఫాఖుల్లాఖాన్, హసన్ మోహనీ, టిపు సుల్తాన్ తదితరుల చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్న ది. జై హింద్, ఇంక్విలాబ్ జిందాబాద్ లాంటి నినాదాలు కూడా ముస్లిం యోధులు సృష్టించినవే.

స్వాతంత్ర్యం కోసం 200 ఏండ్ల పాటు ఎందరో యోధులు కులమతాలకతీతంగా వీరోచితంగా పోరాడారు. 1750లలోనే స్వాతంత్ర్యోద్యమానికి అంకురార్పణ జరిగింది. ఈస్టిండియా కంపెనీ పేరుతో వ్యాపార నిమిత్తం దేశంలోకి అడుగుపెట్టిన ఆంగ్లేయులు చాపకింద నీరులా తమ ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. ముస్లిం పాలకుల నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. ముస్లింలను అధికార పీఠం నుంచి తప్పించి గద్దెనెక్కారు. కోల్పోయిన పీఠాన్ని తిరిగి పొందేందుకు ముస్లింలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడారు. స్వాతంత్ర్య పోరాటానికి మొదట శంఖం పూరించింది ముస్లింలేనన్నది దీనిద్వారా తెలుస్తున్నది. 1753లో ముర్షీదాబాద్, బెంగాల్‌లో సిరాజుద్దౌలా తాత అలీవర్దీఖాన్ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడారు. 1799లో దక్షిణ భారతదేశంలో మైసూరు పులి టిప్పు సుల్తా న్, ఆయన తండ్రి హైదర్ ఆంగ్లేయులతో పోరాడా రు. కొందరు స్వదేశీయులు ఆంగ్లేయులతో చేతులు కలపకుండా ఉంటే మన దేశానికి 200 ఏండ్లకు పూర్వమే స్వాతంత్ర్యం లభించేది. తెల్లవాళ్ల నుంచి ఈ దేశానికి విముక్తి కలిగించేందుకు ఎంతోమంది యోధులు తమ రక్తాన్ని చిందించాల్సి వచ్చింది. జైళ్లల్లో మగ్గాల్సి వచ్చింది. ఉరికంబాన్ని ముద్దాడాల్సి వచ్చింది. ఆస్తులన్నీ ధారపోయాల్సి వచ్చింది. ఇల్లూవాకిలీ వదిలేయాల్సి వచ్చి ంది. ఈ క్రమంలో ఆంగ్లేయుల కబంధ హస్తాల నుంచి ఈ దేశానికి విముక్తి కల్పించేందుకు తమ ధన, ప్రాణాలను మూల్యంగా చెల్లించుకునేందుకు ముస్లింలు ఎప్పుడూ ముందు వరుసలోనే ఉన్నారు.

చివరి మొగల్ చక్రవర్తి బహదూర్‌షా జఫర్‌ను బ్రిటిషర్లు రంగూన్ జైలులో బంధించి, కండ్లముందే అతని నలుగురు కుమారులను గొంతుకోసి చంపేశారు. 'చక్రవర్తిగా పాలించిన నాకు రెండడుగుల భూమి కూడా దొరకని దుస్థితి. ఇంతకంటే దురదృష్టవంతులు ఎవరుంటారు' అని తన ఆవేదనను కవిత రూపంలో రాసుకున్నాడాయన. స్వాతంత్ర్యం కోసం ముస్లింలు చేసిన త్యాగాలకు మచ్చుతునక ఇది.

ముస్లిం యోధులు అనుభవించిన శిక్షల్లో కాలాపానీ శిక్ష అత్యంత పాశవికమైనది. ఈ కాలాపానీ జైల్లో మగ్గినవారిలో 95 శాతం ముస్లింలే. అందులోనూ ఉలమాలే అధికం. మౌలానా జాఫర్, మౌలానా విలాయత్ అలీ (రహ్మతుల్లై), మౌలానా యాహ్యా (రహ్మతుల్లై) లాంటి ఉలమాల పేర్లు ముందువరుసలో ఉంటాయి. కాలాపానీ శిక్షకు భయపడి చాలామంది బ్రిటిషర్లకు కొమ్ముకాస్తూ మహాత్మాగాంధీకి వ్యతిరేకంగా పనిచేసేవారు. గాంధీని హత్యచేసిన వర్గం స్వతంత్ర పోరాటానికి వ్యతిరేకంగా, ఆంగ్లేయులకు అనుకూలంగా పనిచేసింది. కాలాపానీ జైలులో ఎలాంటి శిక్షలు అనుభవించారో పలువురు ఉలమాలు తమ పుస్తకాల్లో రాసుకున్నారు.

మలబార్‌లో మోప్లా ముస్లింలు కూడా స్వతం త్ర సంగ్రామంలో చురుగ్గా పాల్గొన్నారు. మోప్లా ముస్లింలను ఆంగ్లేయులు చిత్రహింసలు పెట్టారు. కేరళకు చెందిన 125 మంది ముస్లింలను బ్రిటిషర్లు బంధించారు. వాళ్లను కోర్టులో హాజరుపర్చేందుకు మాల్‌గాడీలో తీసుకెళ్లారు. 50 మంది పట్టే వాహనంలో 125 మందిని కుక్కి తలుపులు మూసేశారు. 3 రోజుల ప్రయాణం తర్వాత తలుపు తీసి చూడగా.. 65 మంది ఊపిరాడక చనిపోయి ఉన్నారు. మిగతా వారంతా స్పృహ తప్పి పడిపోయారు. బతికిన వారిని మద్రాసు కోర్టులో హాజరుపర్చి ఉరిశిక్ష వి ధించారు. కేరళ ప్రభుత్వం 1971లో వారి త్యాగాలను గుర్తించి మోప్లా యోధుల కుటుంబాలకు పింఛను మంజూరు చేయడం వారి త్యాగాలకు నిదర్శనం.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ (రహ్మతుల్లై) జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆజాద్‌పై అడుగడుగునా ఆంక్షలుండేవి. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలించేందుకు ఆయన సొంతంగా పత్రికను నడిపేవారు. దీన్ని సహించని ఆంగ్లేయులు అల్ హిలాల్ పత్రికను నిషేధించారు. మౌలానాను బంధించిన అహ్మద్‌నగర్ జైలు నేటికీ అందుకు సాక్ష్యంగా నిలుస్తున్నది. మౌలానా హుస్రత్ మోహానీ తన కవితలతో ముస్లింలపై ఎంతో ప్రభావం చూపించారు.

ఉలమాలు స్వతంత్ర సమరాంగణంలో రాజీలేని పోరాటాలు చేశారని, ఎనిమిది లక్షల మంది బలిదానాలు చేశారని డాక్టర్ తారాచంద్ అనే రచయిత తన గ్రంథంలో రాశారు. ఈ దేశానికి ఎప్పుడు ఆపద వచ్చినా 'మేమున్నా'మంటూ ముస్లింలు ముందుకొచ్చారు. దురదృష్టవశాత్తూ 1947లో దేశ విభజన జరిగింది. ఈ దేశాన్ని విభజించడాన్ని చాలామంది ముస్లింలు తీవ్రంగా ఖండించారు. సింధ్ నుంచి మద్రాసు దాకా అఖండ భారత్ ఉండాలని వారు కోరుకున్నారు. వారిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒకరు. ఢిల్లీ జామా మసీదు వద్ద ఆజాద్ చేసిన ప్రసంగం చరిత్రాత్మకం. 'మీరంతా ఎక్కడికి వెళ్తున్నారు? ఎందుకు వెళ్తున్నారు? ఈ మసీదు మినార్లు మిమ్మల్ని పిలుస్తున్నాయి. విభజన వల్ల దేశంలోని ముస్లింలు బలహీనపడతారు' అని నాడు ఆయన చేసిన ప్రసంగం పుస్తకాల్లో నేటికీ నిక్షిప్తమై ఉంది. ఈ దేశ స్వతంత్ర సమరాంగణంలో ముస్లింల త్యాగాలు చిరస్మరణీయమనే విషయాన్ని అందరూ తెలుసుకోవాలి.



విభేదాలు సృష్టించకండి!

హక్కులనేవి అందరికీ సమానంగా ఉంటాయి. హిందూ, ముస్లింలు అనే తారతమ్యాలు చూపొద్దు. మనమంతా ఒక్కటే. మనలో విభేదాలు సృష్టించకండి. వారు (హిందువులు) మన దేశ ప్రజలు కాదా? మనమంతా కలిసి పోరాడాం. ఇప్పుడు మనమంతా కలిసి జీవించాలి.

- యూనుస్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత